సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 9 । మే । 2023



కమనీయం.. కల్యాణం

కామారెడ్డి పట్టణంలోని లింగాపూర్‌లో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

- 9లో ▸



ప్రజావాణికి 81 ఫిర్యాదులు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 81 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /25.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమవుతుంది.

కుర్చీలాటలో..
కీలక మలుపు

- తెయూ రిజిస్ట్రార్‌గా యాదగిరి
- ఉస్మానియా యూనివర్సిటీలో తిరిగి చేరిన నిర్మలదేవి
- వర్సిటీల చట్టం, సెక్షన్లతో యాక్షన్‌లోకి దిగిన పాలకమండలి
- విద్యావర్ధినిపై సస్పెన్షన్, కనకయ్యపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్న ఈసీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పదవి విషయంలో తాజాగా కీలక మలుపు చోటుచేసుకుంది. పాలక మండలి తీర్మానాన్ని కాదని వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా ఉస్మానియా వర్సిటీ నుంచి తీసుకొచ్చి రిజిస్ట్రార్‌గా నియమించిన నిర్మలదేవి తిరిగి ఉస్మానియాలో రీజాయిన్ అయ్యారు. మే 3న తెలంగాణ వర్సిటీ బాధ్యతలు స్వీకరించిన ఆమె తాను ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కు వెళ్లేది లేదని, రిజిస్ట్రార్‌గా కొనసాగుతానని చెప్పినప్పటికీ ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నారు. పాలకమండలి నిర్ణయాన్ని ఖాతరు చేసేది లేదని చెప్పినప్పటికీ తీరా ఇలా వెనక్కు వెళ్లడానికి తత్వం బోధపడినట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వీసీ వ్యవహారాలు, ముగ్గురు రిజిస్ట్రార్ల లావాదేవీలకు సంబంధించి పాలకమండలి క్రిమినల్ చర్యల దిశగా ముందుకు కదలడంతో నిర్మలదేవి ఆగమేఘాల మీద వెళ్లి ఓయూలో రిపోర్ట్ చేశారు. గత నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించిన తెయూ పాలకమండలి సమావేశం నుంచి ఉన్నతవిద్యా శాఖ కమిషనర్‌తో గొడవపడిన వీసీ రవీందర్‌గుప్తా వాకౌట్ చేశారు. పాలకమండలి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరిని నియమించింది. అయితే వీసీ హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తీసుకొచ్చి పాలకమండలి తీర్మానాన్ని రద్దు చేయించారు. కొత్తగా ఉస్మానియా వర్సిటీ నుంచి తీసుకొచ్చి ప్రొఫెసర్ నిర్మలదేవిని రిజిస్ట్రార్‌గా నియమించారు. నిర్మల దేవి తిరిగి వెనక్కు రావాలని ఓయూ వీసీ రవీందర్ యాదవ్ ఆదేశాల మేరకు అక్కడి రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆ ఉత్తర్వులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆమె అన్నారు. అయితే ఈ నెల 5న జరిగిన ఈసీ సమావేశంలో పాలకమండలి 1991 తెలంగాణ వర్సిటీల చట్టంలోని వివిధ సెక్షన్ల ద్వారా యాక్షన్‌లోకి దిగడంతో మలుపులు చోటుచేసుకుంటున్నాయి.

■ ఇదిలా ఉండగా గత నెల 26న జరిగిన పాలక మండలి సమావేశంలో విద్యావర్ధినిని ప్రొఫెసర్ విధుల నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు రిజిస్ట్రార్ యాదగిరి మాత్రం సస్పెన్షన్ ఆర్డర్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఈ విషయమై తదుపరి ఈసీ సమావేశంలో తగినవిధంగా ముందుకు వెళ్లేందుకు పాలకమండలి సభ్యులు రంగం సిద్ధం చేస్తున్నారు.

మరోవైపు గతంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన కనకయ్య నిర్వహించిన లావాదేవీలపై సైతం చర్యలు తీసుకునే దిశగా పాలకమండలి ముందుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద తెలంగాణ వర్సిటీ వ్యవహారాల సెగ ఉస్మానియా వర్సిటీకి తాకగా, దాని నుంచి ఉస్మానియా వర్సిటీ వారంలోపే బయటపడినట్లయ్యింది. నిర్మలదేవి ఓయూలో తిరిగి చేరడంతో ఒక అంకం కొలిక్కి వచ్చినట్లైంది. తదుపరి ఈసీ సమావేశంలో తీసుకునే నిర్ణయాలపై ఉత్కంఠ నెలకొంది.

■ పాలకమండలి అనుమతి లేకుండా వీసీ రవీందర్‌గుప్తా శివశంకర్, విద్యావర్ధిని, నిర్మల దేవిలను వరుసగా రిజిస్ట్రార్లుగా నియమించారు. ఈ ముగ్గురి రిజిస్ట్రార్‌లపై క్రిమినల్ కేసులు పెట్టాలని పాలక మండలి నిర్ణయించింది. అక్రమ నియామకాలు, నిబంధనల ఉల్లంఘన, అడ్డగోలు చెల్లింపులకు సంబంధించి చెక్కులపై సంతకాలు పెట్టడం, నిధుల దుర్వినియోగం తదితరాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, ఏసీబీ డీజీ, నిజామాబాద్ సీపీలతో ఉన్నతస్థాయి విచారణ చేయించాలని తీర్మానించారు. ఈ నెల 12న మరోసారి ఈసీ సమావేశమై మరిన్ని చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

అతివేగానికి ముగ్గురు బలి

- కారును ఢీకొట్టిన టిప్పర్
- అక్కడికక్కడే దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు



షెహజాదిబేగం(ఫైల్) సమీర్, ఫాతిమా(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: మితిమీరిన వేగం ముగ్గురిని బలితీసుకుంది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద గ్రామానికి చెందిన హనీఫా పెద్ద కూతురు షెహజాది బేగం(35) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ శివారులోని ప్రమీల ఫాంహౌస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ బలిజగూడలో నివాసముంటోంది. వేసవి సెలవులు కావడంతో హనీఫా తన రెండో కూతురి కొడుకు ఎండీ సమీర్ (9), మూడో కూతురి కుమార్తె ఫాతిమా(5)ను తీసుకుని పదిరోజుల క్రితం షెహజాది బేగం ఇంటికి వచ్చింది. ఆదివారం రాత్రి షెహజాది బేగం ఇద్దరు చిన్నారులతో కలిసి తన కారులో పెద్దఅంబర్‌పేటలోని ఓ బేకరి వద్దకు వెళ్లింది. 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఏఎల్‌నగర్ కమాన్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న షెహజాది బేగం, సమీర్, ఫాతిమా కారులోంచి ఎగిరి చెల్లాచెదురుగా పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో రెండు వాహనాలు కూడా అతి వేగంగా ప్రయాణిస్తుండడంతోనే ఇంత ఘోరం జరిగిందని స్థానికులు చర్చించుకున్నారు. కారు ఇంజిన్ ఊడిపోయి కొద్దిదూరంలో పడిపోగా, టిప్పర్ ఘటనా స్థలంలో బోల్తాపడడం గమనార్హం.

వాహనం ఢీకొని బాలుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న దీపక్ తేజ

బోధన్‌టౌన్/నిజామాబాద్ సిటీ: కారు ఢీకొని బాలుడికి తీవ్రగాయాలైన ఘటన బోధన్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన అజ్జ ఒడ్డెన్న, రాధ దంపతుల ఏకైక కుమారుడు దీపక్ తేజ(12) తల్లిదండ్రులతో కలిసి పట్టణ శివారులోని నర్సి రోడ్డులో గల రాయల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి ఆదివారం హాజరయ్యాడు. పెళ్లి తర్వాత ఇంటికి వెళ్లడానికి బాలుడు బయటకు వచ్చాడు. కాగా పక్కనే ఉన్న మరో ఫంక్షన్ హాల్‌లో జరిగే వివాహ వేడుకకు హాజరవ్వడానికి బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతీమా వస్తున్నారు. ఆమె వెనుక ఉన్న అనుచరుల కారు దీపక్ తేజను ఢీకొంది. దీంతో స్థానికులు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రైవేటు ఆ స్పత్రికి తరలించారు. అనంతరం నిజామాబాద్‌కు తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలుడికి తీవ్రగాయాలైనట్లు సీఐ ప్రేంకుమార్ తెలిపారు.

మరో వివాదంలో ఎమ్మెల్యే కుటుంబం

ఎమ్మెల్యే షకీల్ కుటుంబం మరో రోడ్డు ప్రమాద వివాదంలో చిక్కుకుంది. ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతీమా ప్రయాణిస్తున్న వాహనం వెనక వస్తున్న కారు ఢీకొని దీపక్ తేజా గాయపడ్డాడు. ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కుమారుడు ప్రయాణిస్తున్న కారు ఢీకొని పసిపాప మృతి చెందింది. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

న్యూస్‌రీల్

11న వశిష్ట కళాశాలలో జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి వశిష్ట డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 11న ఉదయం 10గంటల నుంచి అమెజాన్, గోల్డ్ మెన్‌సాస్, జేపీ మోర్గాన్ కంపెనీల్లో సీనియర్ ఆఫీసర్, బ్యాక్‌ఎండ్ ఆపరేషన్స్‌కు సంబంధించి 80 ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ లేదా బీటెక్ కోర్సులో 50శాతం మార్కులు పొంది 25 ఏళ్లలోపు యువత ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ. 3లక్షల నుంచి రూ. 6 లక్షలు ఉంటుందన్నారు. డిగ్రీ, బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు సైతం పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 91773 40093 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కిష్టవ్వ మృతదేహం అప్పగింత

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వృద్ధురాలు కడమంచి కిష్టవ్వ(70) మృతదేహాన్ని తీసుకెళ్లడానికి నిరాకరించిన బంధువులకు సోమవారం మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు, వైద్యాధికారులు ఇద్దరు కూతుళ్లు ఎల్వవ్వ, పెంటవ్వ, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి మృతదేహాన్ని అప్పగించారు.

4,975 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాల్లో సోమవారం 4,975 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 393 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 3,82,914 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 57,201 మందికి కంటి అద్దాలను అందజేశారు.

గాంధారిలో గాలివాన



గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి మండలంలో సోమవారం సాయంత్రం గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మొక్కజొన్నలు తడిచిపోయాయి. స్థానిక వ్యవసాయ యార్డులో ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడ్డారు.

కళాభారతి పనులకు ముందడుగు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కళాభారతి పనులకు గ్రీన్‌సిగ్నల్.. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన సుమారు 5 నెలలకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. రూ. 50 కోట్లతో కళాభారతి నిర్మాణం పాత కలెక్టరేట్ ప్రాంతంలో జరగనుంది. టెండర్ ప్రక్రియలో దాస్ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్(డీఈసీ) దక్కించుకుంది. వారం రోజుల్లో అగ్రిమెంట్‌ను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. రెండేళ్లలో కళాభారతి నిర్మాణం పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. అధునాతన పద్ధతిలో కళాభారతి నిర్మాణం జరగనుంది.

రూ.2 కోట్లతో రేషన్ డీలర్ పరారీ!

డొంకేశ్వర్ (ఆర్మూర్): డొంకేశ్వర్ మండలానికి చెందిన రేషన్ డీలర్ ఒకరు సుమారు రూ. 2 కోట్లతో ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దాదాపు 80 మందికి కుచ్చు టోపి పెట్టడంతో బాధితులంతా కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెలితే.. సుభాష్ గౌడ్ అనే వ్యక్తి మారంపల్లి నుంచి వచ్చి గంగాసముందర్‌లో గత 25 ఏళ్లుగా కుటుంబతో నివాసం ఉంటున్నాడు. పదేళ్లుగా డీలర్‌షిప్ తీసుకుని ఊరిలోనే రేషన్ దుకాణం నడుపుతున్నాడు. అయితే, రేషన్ షాపుతో పాటు ఫైనాన్స్, చిట్టీలు కూడా నడిపేవాడు. రేషన్ డీలర్ కావడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని పరిచయస్తులు కూడా సుభాష్‌గౌడ్ వద్ద చిట్టీలు వేశారు. నమ్మకంతో కొంతమంది అప్పులు కూడా ఇచ్చారు. అప్పులు పెరగడంతో డబ్బులు రొటేషన్ కాలేదు. ఏం చేయాలో దిక్కుతోచక సొంతింటిని, రేషన్ దుకాణాన్ని వదిలి ఏప్రిల్ 22 అర్ధరాత్రి కుటుంబంతో సహా పరారీ అయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. గంగాసముందర్‌తో పాటు మారంపల్లి, నూత్‌పల్లి గ్రామాల్లో కూడా బాకీలు చేసినట్లు తెలిసింది.

వైద్య సౌకర్యాలు, వసతులు కల్పించాం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో ఫిజియోథెరపి కేంద్రం ప్రారంభం



బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో ఫిజియోథెరపి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

బాన్సువాడ: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలతో పాటు రోగి వెంట వచ్చే వారి కోసం అన్ని వసతులు కల్పించామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం, వయోవృద్ధుల ఫిజియోథెరపి కేంద్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి స్పీకర్ పోచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం, వయోవృద్ధుల ఫిజియోథెరపి కేంద్రాలను ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. ఈ ప్రాంతంలోని మానసిక రోగులకు, వృద్ధులకు ఈ కేంద్రాలతో చికిత్స లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రిలో ఉండే స్థాయి సౌకర్యాలు బాన్సువాడలో ఏర్పాటు చేయించామని తెలిపారు. బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాల ఏర్పాటుతో పాటు బ్లడ్ బ్యాంకు, డయాలసిస్ యూనిట్, ఆక్సిజన్ యూనిట్, టిఫా స్కానింగ్, ఎస్‌ఎన్‌సీయూ, ఎంఐసీయూలను ఏర్పాటు చేశామన్నారు. ఏరియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. రూ. 20 కోట్లతో 100 పడకల సామర్థ్యంతో మాతా శిశు ఆస్పత్రిని నిర్మించామని, నెలకు 400లకు పైగా డెలివరీలు జరుగుతున్నాయన్నారు. ప్రారంభించిన రెండేళ్లలోనే తల్లి పాల ప్రోత్సాహం అంశంలో బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రికి జాతీయ స్థాయి అవార్డు వచ్చిందని, ఈ అవార్డుతో బాన్సువాడ ఎంసీహెచ్‌కు దేశంలోనే గుర్తింపు వచ్చిందని సూచించారు. ఏరియా ఆస్పత్రికి, మాతాశిశు సంరక్షణ కేంద్రానికి కలుపుతూ ప్రధాన రహదారి మీదుగా రూ. 3 కోట్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, పనులు తుది దశకు చేరాయన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని స్పీకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసి మోపెడు..!



- చివరికి రైతుల కష్టాలు
- అన్నదాతలపై కోతల భారం
- అకాల వర్షాలతో ఆరని తేమ
- చైన్ యంత్రాలతోనే కోతలు
- ధాన్యం తరలించేందుకు అవస్థలు

బాన్సువాడ: అకాల వర్షాలతో ధాన్యం గింజలు నేలరాలగా.. మిగిలిన పంట కోసేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాల కారణంగా నేల బురదమయంగా మారడంతో పంటలు కోయడానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఆర్థిక భారం పెరిగింది. వరి పైరును కోసేందుకు చైన్ యంత్రాలకు గంటకు రూ. 2,800 నుంచి రూ. 3,200 వరకు చెల్లించాల్సి వస్తోంది. అయినా పండించిన ప్రతి గింజ ఇంటికి వస్తుందనే నమ్మకం లేకుండా పోయింది. పంటకు దోమపోటు, కొంకిరోగం, పొల్లు వచ్చి సగం దిగుబడి తగ్గింది. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు 30 నుంచి 40 శాతం ధాన్యం గింజలు నేలరాలాయి. ఉన్న పంటను కోత కోయాలంటే నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేల బురదగా మారడంతో కోత యంత్రాలతో వరి పైరును కోసి ధాన్యం గింజలు ట్రాక్టర్లలో వేసేందుకు రోడ్డువరకు వచ్చి పోయాల్సి వస్తోంది. ఎకరం వరి పైరు కోయాలంటే మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుండగా, రైతులపై తీవ్రభారం పడుతోంది.

కొనుగోలు కేంద్రాలకు తరలించాలంటే కష్టమే..

పంటను ఏదోలాగా కోయించిన రైతులు ఆయా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. నేల బురదగా ఉండడంతో ట్రాక్టర్లు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి. పైరు కోయించడం ఒక్క ఎత్తయితే.. అక్కడి నుంచి ధాన్యాన్ని రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ వరకు తీసుకురావడం మరో ఎత్తుగా మారింది. పొలంలో ట్రాక్టర్ దిగబడ్డా, చైన్ యంత్రాలు దిగబడ్డా బయటకు తీసేందుకు రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న ఖర్చులు


నేల బురదమయంగా మారకుంటే ట్రాక్టర్‌కు బిగించే టైర్ హార్వెస్టర్లు సులభంగా వరి పైరు కోస్తాయి. టైర్ల హార్వెస్టర్లు గంటకు రూ. 2వేల వరకు అద్దె చెల్లిస్తే సరిపోయేది. పొలం మడులు పెద్దగా ఉంటే ఎకరం పొలం ఒక గంటలోనే టైర్ హార్వెస్టర్లు కోసేవి. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలకు నేల బురదమయంగా మారడంతో చైన్ యంత్రాలతోనే రైతులు వరి పైరు కోస్తున్నారు. గతంలో చైన్ యంత్రం గంటకు అద్దె రూ. 2,200 నుంచి రూ. 2,400 వరకు వసూలు చేసే వారు. పొలాల్లో బురద, నీళ్లు ఎక్కువగా ఉండడంతో రూ. 2,800 నుంచి రూ. 3,200 వరకు వసూలు చేస్తున్నారు. గంటకు ఎకరం పొలం కోత కోసే చైన్ యంత్రం ప్రస్తుతం రెండు నుంచి మూడు గంటల వరకు సమయం పడుతుంది. తద్వారా అన్నదాతపై పంట కోత ఖర్చు మూడింతలు పెరిగింది.

అవస్థలు పడ్డా..

ఇటీవల కురిసిన వర్షాలకు నేల పూర్తిగా బురదగా మారింది. చైన్ యంత్రాలతోనే పైరు కోశాం. యంత్రం కోసిన ధాన్యం గింజలను రోడ్డు వరకు తీసుకురావాలంటే అరగంట సమయం పడుతుంది. ఒక్క ఎకరం పొలం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టింది. రైతులపై ఈ సారి తీవ్రంగా భారం పడింది. **– సాయిలు, రైతు బాన్సువాడ**

సైలెన్సర్ల మోత.. ఇదేం రోత!

- బైకులకు భారీ శబ్దాలతో కూడిన సైలెన్సర్ల ఏర్పాటు
- రాత్రిపూట హోరెత్తిస్తున్న రైడర్స్
- సౌండ్ పొల్యూషన్‌తో నిద్రకు ఆటంకం
- పట్టించుకోని పట్టణ పోలీసులు



సాక్షి, కామారెడ్డి: ద్విచక్ర వాహనాలకు ఉండే సైలెన్సర్ల స్థానంలో సౌండ్ హోరెత్తించే సైలెన్సర్లను బిగించుకుని కొందరు చేస్తున్న హంగామా ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా బైక్ రేసింగులు నడుస్తున్నాయి. ప్రధాన రోడ్ల మీదే పోటాపోటీగా వాహనాలను అత్యంత వేగంగా, ప్రమాదకరంగా నడుపుతున్నారు. దీనికి తోడు ఆ వాహనాలకు ప్రత్యేకంగా బిగించిన సైలెన్సర్లు చేస్తున్న చప్పుళ్లు జనానికి ఇబ్బందికరంగా మారాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు బైకులకు ఉన్న సైలెన్సర్లను పెద్దపెద్ద సౌండ్స్ వచ్చేలా ఆల్ట్రేషన్ చేయించి నడుపుతున్నారు. వేగంగా భారీగా సౌండ్ వచ్చేలా నడుపుతుండడంతో రోడ్డుపై వెళ్లే జనం భయపడాల్సి వస్తోంది. ఒక్కోసారి ఆ వాహనాల శబ్దాల భయానికి జనం పరుగులు పెడుతున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద అడ్డా వేయడం, ఒక్కసారిగా బైకులను స్టార్ట్ చేసి వేగం పెంచుతూ జనాన్ని హడలగొడుతున్నారు. చాలా కాలంగా జిల్లా కేంద్రంలో బైక్ రేసింగులు, బైకులకు ఆల్ట్రేషన్ చేసిన సైలెన్సర్లు వాడుతున్నారు. అయినా పోలీసులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నియంత్రించకుంటే ఇబ్బందే..

బైకులకు ఉండే సైలెన్సర్లను మార్చి కొత్తగా అమరుస్తున్న సైలెన్సర్లతో వచ్చే సౌండ్స్ మూలంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు యువకులు మోజుతో తిరుగుతుండగా, మరికొందరు జులాయిగా తిరుగుతూ హంగామా చేస్తున్నారు. వారిని నియంత్రించకుంటే వారి భవిష్యత్తుపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు బైక్ రేసింగుల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా పట్టణ పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బైకులకు బిగించిన సైలెన్సర్లను తొలగించడంతో పాటు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి దారిలోకి తీసుకురావలని పట్టణవాసులు కోరుతున్నారు.



రాత్రుల్లో హంగామా..

జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో రాత్రిపూట బైక్ రేసింగులకు పాల్పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లపైనే రేసింగులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారులైన పాత జాతీయ రహదారి, అశోక్‌నగర్, విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, జన్మభూమి రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, స్టేషన్‌రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, అడ్లూర్ రోడ్డు, రామారెడ్డి రోడ్డు, సుభాష్‌రోడ్డు, తిలక్ రోడ్డు, గంజ్‌రోడ్డు, పెద్ద బజార్ తదితర ప్రాంతాల్లో యువకులు బైకులపై తిరుగుతూ నానా హంగామా చేస్తున్నారు. ఎంజాయ్ పేరుతో ద్విచక్రవాహనాలను వేగంగా నడపడం, హోరెత్తించే చప్పుళ్లు చేస్తుండడంతో ఇళ్లల్లో పడుకున్న వారు కూడా నిద్ర నుంచి మేల్కొనాల్సి వస్తోంది. సాయంత్రం నుంచే ద్విచక్ర వాహనాలపై బయటకు రావడం, రోడ్లపై అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. రాత్రిపూట నిశ్శబ్దం ఎక్కువగా ఉండి, వాహనాల చప్పుడు మరింత ఎక్కువగా వస్తోంది. జిల్లా కేంద్రంలో బైక్ రైడర్స్ చేస్తున్న హంగామా ప్రజలకు ఇబ్బందికరంగా మారినప్పటికీ పట్టణ పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

క్లుప్తంగా

మత్స్యకారులు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న మత్స్యకారులందరూ టీ–మత్స్య వెబ్‌సైట్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా 8,856 మంది వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉందని, చేసుకోని పక్షంలో బీమా వర్తించదని పేర్కొన్నారు. మత్స్యకారులు ఆధార్, బ్యాంక్ ఖాతా, నామిని వివరాలను జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో త్వరగా అందజేయాలని కోరారు.

సహకార సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో 354 మత్స్య సహకార సంఘాలుండగా, 50 సంఘాలకు ఎన్నికలు జరపాల్సి ఉందని, డీడీలు చెల్లించి ఎన్నికలు నిర్వహించుకోవాలని రాజనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతీ సంఘానికి పాలక వర్గం తప్పనిసరి చేసిందని, పదవీ కాలం పూర్తయిన వారు జిల్లా కార్యాలయంలో డాక్యుమెంట్లను సమర్పించాలని సూచించారు.

మారిన ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు కొత్త సెల్‌ఫోన్ నంబర్లు వచ్చాయని ఏసీబీ డీఎస్పీ ఏపీ ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.డీఎస్పీ నంబర్ 9154388950, ఏసీబీ ఎస్సై నగేష్, ఎస్సై శ్రీనివాస్ 9154388953, హైదరాబాద్ ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 అని పేర్కొన్నారు.ఎవరైనా లంచం అడిగితే ఏసీబీని సంప్రదించాలన్నారు.

ఇరువర్గాలపై కేసు

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సార్ల రాజు ఫిర్యాదు మేరకు బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి డ్రైవర్ విజయ్‌తో పాటు, స్వామి, వంజరి విజయ్, శివరాజు, రాజుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చారి తెలిపారు.తన ఇంటికి వచ్చి హత్యాయత్నానికి పాల్పడ్డారని రాజు ఫిర్యాదు చేశారన్నారు. ఇదే విషయంలో సార్ల రాజు తమపై దాడి చేశాడని బీజేపీ నాయకులు విజయ్ సైతం ఫిర్యాదు ఇవ్వగా ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దుబాయిలో గుండెపోటుతో అడ్లూరు వాసి మృతి


రవి(ఫైల్)

కామారెడ్డి టౌన్: బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌కు చెందిన ఇసాయిపేట రవి (43) కొన్ని ఏళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సమయంలోనే అతనికి సోమవారం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు పనిచేస్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహం స్వగ్రామానికి రావడానికి మరో వారం సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మృతుడికి భార్య సుజాత, కూతుర్లు ఐశ్వర్య, శ్రీలేఖ ఉన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు..

రాజంపేట: ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఆరెపల్లి తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన ఒకరు హార్వెస్టర్‌తో పొలం కోసి, ట్రాక్టర్‌లో వడ్లు తరలిస్తున్నారు. ఆ ట్రాక్టర్‌లో తండాకు చెందిన లంబాడి శివకుమార్(12) వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..

ఎడపల్లి: ఎడపల్లి శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మతి చెందింది. గుర్తు తెలియని వాహనం ఢీకొని బుర్కా ధరించిన 35 ఏళ్ల మహిళ చనిపోయినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


నిజామాబాద్ ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈఓ గోవింద్, డీపీఓ జయసుధ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాగా ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేస్తూ, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

దివ్యాంగులపై వేధింపులు నివారించాలి

ప్రభుత్వ వికలాంగుల చట్టం–2016 ప్రకారం రాష్ట్రంలో అనేక చోట్ల జరుగుతున్న వికలాంగులపై వేధింపులు, అవమానాలు, దౌర్జన్యాలను నివారించాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. భారత ప్రభుత్వ వికలాంగుల చట్టం–2016పై అవగాహన కల్పించాలని, చట్టాన్ని పకడ్బందీగా అమల్జేయాలని కోరారు.

రోడ్డు కబ్జా కాకుండా చూడాలి

జక్రాన్‌పల్లిలో శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, రోడ్డు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. ఆ రోడ్డు కబ్జా అయితే గ్రామస్తులందరికీ శ్మశానవాటికకు వెళ్లేందుకు ఇబ్బందులు అవుతాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

కామారెడ్డిలో 81 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీఓ సాయన్న, ఏఓ రవీందర్ పాల్గొన్నారు.

జీపీ నిధుల దుర్వినియోగంపై..

తమ గ్రామ పంచాయితీలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని సదాశివనగర్ మండలం ధర్మారావుపేట ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో ఈ విషయమై డీపీవోకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో మార్చి 20న జీపీ వద్ద గ్రామస్తులందరి సమక్షంలో విచారణ జరిపినట్లు తెలిపారు. విచారణలో తప్పిదాలు జరిగినట్లు వెల్లడైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. శ్మశాన వాటిక నిర్మాణానికి జీపీ నుంచి రూ.మూడు లక్షలకుపైగా తీసుకొని ఇప్పటికీ తిరిగి చెల్లించడం లేదన్నారు.

కుళాయి నీళ్లు కలుషితం



కుళాయి నీళ్లు కలుషితం అవుతున్నాయని ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన బండారి రాజిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన నల్లా నీళ్లను బాటిల్‌లో నింపుకొని ప్రజావాణికి తీసుకువచ్చి అధికారలకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



మద్నూర్ తహసీల్దార్ అనిల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలానికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బీజేపీ మద్నూర్ మండల అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ తహసీల్దార్ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నల్లమట్టి, మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మహారాష్ట్రకు మట్టి, మొరం తరలివెళ్తున్నాయని అన్నారు. అంతే కాకుండా అధికార పార్టీ నాయకులతో కలిసి దాబాలు, హోటళ్లలో విందు భోజనాలు, జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. అందుకు సంబంధించిన చిత్రాలను చూపించారు.

చట్ట పరిధిలోనే పని చేయాలి


న్యాయ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

డిచ్‌పల్లి: గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, చట్టపరిధిలో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. డిచ్‌పల్లి మండలం లింగసముద్రం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో వీడీసీలు చట్టవ్యతిరేకమైన తీర్మానాలు, కొన్ని కులాలను సామాజిక బహిష్కరణ చేసిన తీరు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు విచారణలో ఉన్నట్లు తెలిపారు. వీడీసీల తీరులో మార్పు రావాల్సిన అవసరం ఉందని, చట్టం అనే ఆయుధం చాలా బలమైందనే విషయాన్ని మరువరాదని ఆమె గుర్తు చేశారు. అన్నదాతల్లో న్యాయ చైతన్యం తీసుకురావడానికి అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రహదారులపై ధాన్యం ఆరబోత ప్రమాదకరమన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. సంఘాలుగా ఉండటం తప్పు కాదని, వాటి ముసుగులో చట్ట వ్యతిరేక చర్యలను సహించబోమని హెచ్చరించారు. డిచ్‌పల్లి తహసీల్దార్ పి శ్రీనివాసరావు, ఎంపీడీవో గోపిబాబు, సర్పంచ్ వినోద, డిచ్‌పల్లి సీఐ కృష్ణ, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆశనారాయణ, న్యాయసేవా సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య


సాయిలు(ఫైల్)

లింగంపేట: మండలంలోని సజ్జన్‌పల్లికి చెందిన ఎల్లన్న గారి సాయిలు(32) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. ఎల్లన్నగారి దుర్గయ్యకు ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు సాయిలుకు పదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. ఇతనికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎకరం భూమి ఉంది. అందులో ఏడాది క్రితం 3 బోర్లు వేయించాడు. నీళ్లు పడలేదు. తన భార్యకు ఆపరేషన్ నిమిత్తం రూ.50వేలు ఖర్చు చేశాడు. దాంతో రూ.4 లక్షల 50 వేల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలని బాధ పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

ధర్పల్లి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పశువుల పాకలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన ఆలూరి గంగారెడ్డి (52) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తమ పశువుల గుడిసెలో తాడుతో ఉరివేసుకున్నాడు. గంగారెడ్డి నిత్యం మద్యం తాగేవాడని, మద్యం మత్తులో భార్యతో చనిపోతానంటూ అనేవాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అత్తింటి వారి వేధింపులతో వివాహిత..

ఎల్లారెడ్డి: అత్తారింటి వారి సభ్యుల వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీలో నివాసముండే బాజ ఈశ్వరి(28)ని భర్త మోశయ్య, అత్తమామా, మరిది వేధిస్తున్నారు. దీంతో శనివారం రాత్రి ఆమె ఇంట్లో ఉరి వేసుకుంది. మృతురాలి అన్న అల్లం రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్షుద్ర పూజలు చేస్తున్నాడని దేహశుద్ధి


ఆలయం వద్ద గుమిగూడిన ప్రజలు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రం ఏబీనగర్ వద్ద గల పెద్ద పోశమ్మ ఆలయంలో సోమవారం రాత్రి వేల్పూర్ మండలం పడిగెల్ గ్రామానికి చెందిన అల్లెపు పోశెట్టి క్షుద్ర పూజలు చేస్తున్నాడని స్థానికులు దేహశుద్ధి చేశారు. పోశవ్వ ఆలయం వద్దకు త్రిశూలం తీసుకు వచ్చి, పసుపు, కుంకుమ చల్లుతు తవ్వకాలు చేపట్టడన్నారు. గతంలో కూడా ఓ సారి ఆలయం వద్దకు వచ్చి పూజలు చేశాడని స్థానికులు చెప్పారు. రాత్రివేళ పూజలు చేయడంపై అనుమానంతో స్థానికులు ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో దేహశుద్ధి చేశారు. అనంతరం బాల్కొండ పోలీసులకు అప్పగించారు.

గంగస్నానానికి వెళ్లి యువకుడి మృతి


సామ లింబాద్రి(ఫైల్)

ఖలీల్‌వాడి: గంగస్నానానికి వెళ్లి నీటిలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన ఏర్గట్ల మండలంలోని తడపాకల్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. నగరంలోని గాజులపేట్‌కు చెందిన సామ లింబాద్రి(31) కుటుంబ సభ్యులు ఆదివారం తమ బంధువుల పెళ్లికి తడపాకల్ గ్రామానికి వెళ్లారు. పెళ్లి ముగించుకున్న తర్వాత కుటుంబ సభ్యులు గంగస్నానం కోసం వెళ్లారు. లింబాద్రి స్నానం చేయడానికి గంగలోకి దిగి మునిగిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించి మృతదేహం వెలికితీశారు. లింబాద్రి మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

రెంజల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని పేపర్‌మిల్‌కు చెందిన గుర్రాల పోసాని(68) ఆదివారం గ్రామ సమీపంలోని వనదుర్గ ఆలయం నుంచి వస్తుండగా కందకుర్తి గ్రామానికి చెందిన శంకర్ ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ పోసానిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

మర్కల్‌కు చెందిన వృద్ధుడు..

సదాశివనగర్: మండలంలోని మర్కల్‌కు చెందిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన దొడ్లె చిన్న రాజయ్య(78) షుగర్ తో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయన కింద పడడంతో గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చూపించిన గాయాలు మానలేదు. దీనికి తోడు షుగర్ ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం గడ్డిమందు తాగాడు. ఆయనను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరి దుర్మరణం



తాడ్వాయి: మండలంలోని దేవాయిపల్లి స్టేజీ సమీపంలో కామారెడ్డి – ఎల్లారెడ్డి రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. లింగంపేట్ మండలం మోతే గ్రామానికి చెందిన సత్తూరి శ్రీశైలం(40) తన బైక్‌పై తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి నుంచి మోతేకు వెళ్తున్నాడు. లింగంపేట్ మండలంలోని నాగారం తండాకు చెందిన మాలావత్ రవి, రుక్మిణి దంపతులు వారి పిల్లలు హేమంత్, రేఖశ్రీతో బైక్‌పై కామారెడ్డి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో దేవాయిపల్లి స్టేజీ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో శ్రీశైలం అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ మిగతా నలుగురిని పోలీసు వాహనంలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

రుద్రూర్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చందూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ లావణ్యరాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి స్పీకర్ హాజరై వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ మంచి నీరు సరాఫరా చేయాలన్నారు. జూలైలోపు చందూర్ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనులు ప్రారంభించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తుపాన్, వడగండ్ల వాన నష్టాన్ని తప్పించుకునేందుకు పంట సాగు కాలాలను ముందుకు జరుపుకునే విధంగా రైతులను చైతన్యం చేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రిల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, తల్లి పాల ప్రాముఖ్యతను వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో నీలావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ కవితఅంబర్‌సింగ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


చందూర్ మండల సభలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రెన్యూవల్ చేయక ఇబ్బందులు

- ముగిసిన పశు సంవర్ధక శాఖ అటెండర్ల కాలపరిమితి
- నెల నుంచి అటెండర్లు లేక అస్తవ్యస్తంగా మారిన ఆస్పత్రులు


మోర్తాడ్‌లోని పశువైద్యశాల

మోర్తాడ్: పశు సంవర్ధక శాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్లుగా నియమించబడిన వారి 11 నెలల కాలపరిమితి ముగిసిపోయింది. ఏజెన్సీ కాంట్రాక్టు రెన్యూవల్ కాకపోవడంతో అటెండర్ల పునర్‌నియామకం ఇంకా పెండింగ్‌లో ఉంది. నెల రోజుల నుంచి ఆస్పత్రుల్లో అటెండర్లు లేకపోవడంతో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లాలోని వివిధ మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఉన్న పశువైద్యశాలల్లో 24 మంది అటెండర్లు పని చేస్తున్నారు. ఏళ్ల తరబడి వీరిని ఔట్ సోర్సింగ్ విధానంలో ఏజెన్సీల ఆధ్వర్యంలోనే నియమించారు. ప్రతి ఏడాది కాంట్రాక్టు రెన్యూవల్ చేస్తూ అభ్యర్థులను ఉద్యోగంలో కొనసాగిస్తున్నారు. అటెండర్ల కాలపరిమితి 11 నెలలే కావడంతో ముందుగానే ఏజెన్సీలతో కాంట్రాక్టు రెన్యూవల్ పూర్తి చేయించాల్సి ఉంది. ప్రభుత్వం కాంట్రాక్టు విధానంలో కాకుండా ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్లను నియమించడం ప్రతి సారి ఏజెన్సీలను మారుస్తుండటంతో కాంట్రాక్టు రెన్యూవల్ సకాలంలో పూర్తి కావడం లేదు. పశువైద్యశాలల్లో అటెండర్లు లేకపోవడంతో ప్రతి రోజు శుభ్రం చేయడం, ఆస్పత్రికి పశుపోషకులు తీసుకవచ్చిన పశువులకు చికిత్స నిర్వహించడం ఇబ్బందిగా మారింది. అటెండర్లు అందరు గతంలో గోపాలమిత్ర పథకం కింద శిక్షణ పొందివారే ఉన్నారు. ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలనే కాకుండా వైద్యం కూడా చేస్తారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల కాంట్రాక్టు ముగిసిపోక ముందే అటెండర్ల రెన్యూవల్ అంశంను పరిగణలోకి తీసుకుంటే ఎవరికి ఇబ్బంది ఉండదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే రెన్యూవల్..

పశువైద్యశాలల్లోని అటెండర్ల కాంట్రాక్టు రెన్యూవల్ త్వరలోనే పూర్తి కావచ్చు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కాంట్రాక్టు రెన్యూవల్ కాగానే అటెండర్ల పునర్ నియామకం చేస్తారు. కొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

– జగన్నాథచారి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

మేస్త్రీలు, మిల్లర్ యజమానులకు మధ్య ఘర్షణ


గొడవ పడుతున్న ఇరువర్గాల వారు


కాలిపోయిన మిల్లరును పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా స్లాబ్ రేట్ విషయంలో మేస్త్రీలకు, మిల్లర్ యజమానులకు మధ్య గొడవ జరుగుతుంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్ రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో మేస్త్రీలు ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా మిల్లర్ అసోసియేషన్‌కు చెందినవారు పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం ఇస్లాంపూర్ వద్ద ఇతర ప్రాంతానికి చెందిన మిల్లర్‌తో బిల్డింగ్ పనులు చేస్తుండగా అసోసియేషన్‌కు చెందిన కొంతమంది కర్రలతో తరలివచ్చి అక్కడ ఉన్న మేస్త్రీలపై దాడి చేశారు. ఈ క్రమంలో మేస్త్రీలు రమేష్, భాస్కర్, శ్రీనివాస్‌కు గాయాలు అయ్యాయి. అనంతరం మిల్లర్ అసోసియేషన్‌కు చెందిన కొంతమంది మిల్లర్‌పై పెట్రోల్ పోసి దహనం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి వారిని చెదరగొట్టారు. దగ్ధమైన మిల్లర్‌ను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు. మిల్లర్స్ అసోసియేషన్ వారి దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- ప్రేమ వ్యవహారమే కారణమా?
- సిరిసిల్ల జిల్లాలో ఘటన


రవితేజ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన అందె రవితేజ (23) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేస్తున్న సమయంలో ఫోన్ వచ్చింది. భోజనం అనంతరం వాహనంలో పడుకుంటా అని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో స్తంభంపల్లి గ్రామంలో తమ బంధువుల ఇంటికి రవితేజ వచ్చాడు. అక్కడ గేటు వేసి ఉండడంతో గేటు దూకి లోపలికి వెళ్లాడు. తలుపులు తీయాలని బాదడంతో బంధువులు తీయలేదు. వారు బయటకు వచ్చి చూడగా అతడు అప్పటికే నిప్పంటించుకున్నాడు. ఈ క్రమంలో 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రవితేజ మృతి విషయం అతడి తల్లి జ్యోతికి ఫోన్ చేసి చెప్పారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా స్తంభంపల్లిలో ఘటన జరిగిన ఇంటి పరిసరాల్లో ఆరిన రక్తపు మరకలు ఉన్నాయని మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదులో పేర్కొంది. తన కుమారుడు రవితేజకు బంధువుల అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉందని ఈ క్రమంలోనే తన కుమారున్ని కత్తితో పొడిచి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, బంధువుల యువతి, ఆమె తల్లి, మేనమామ, అల్లుడిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ బన్సీలాల్ పరిశీలించారు.

బంధువుల ఆందోళన

సిరిసిల్లటౌన్: స్తంభంపల్లిలో మృతిచెందిన రవితేజ బంధువులు సోమవారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని బైఠాయించారు. ఈ కేసులో దోషులుగా ఆరోపిస్తూ సమీప బంధువులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ వచ్చి రవితేజ బంధువులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ముస్తాక్‌పురా కాలనీకి చెందిన షకీల్(38)పై ఆదివారం అర్ధరాత్రి నలుగురు దాడికి పాల్పడ్డారు. వివరాలు.. షకీల్ ఆదివారం అర్ధరాత్రి 2 గంటలకు బర్త్ డే ఉందని ఇంట్లో చెప్పి బయటకు వచ్చినట్లు తెలిసింది. షకీల్‌ను నలుగురు వ్యక్తులు ఆటోలో ఎక్కించుకొని సోనీ ఫంక్షన్ హాల్ వైపు తీసుకువెళ్లారు. అక్కడ ఆటోను నిలిపి రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న షకీల్‌ను సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై తిరుపతి క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. షకీల్ తోపుడు బండిలో కారీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. షకీల్ ఎవరితో గొడవ పడేవాడు కాదని, ఎలాంటి శత్రుత్వం లేదని కుటుంబీకులు చెబుతున్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని షకీల్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.